

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఆనాటి చెలిమి

**ఒక్క వేలుతో** కంప్యూటర్ కీ బోర్డ్ మీద టకటకా టైప్ చేస్తున్న మహతి ఫోన్ మోగడంతో టైపింగ్ ఆపి, ఆన్సర్ చేసింది.

"హలో"

"హలో.. మహతీ?" అవతలివైపు నించి సందిగ్ధంగా అడిగింది ఓ కంఠం

"యస్. మీరు?"

"మహీ.. నేనే. అనుపమని" ఆమె ఉద్వేగంగా అరిచింది.

మహతి నమ్మలేనట్లుగా ఫోన్ వంక ఓసారి చూసి అడిగింది.

"అనూ! నువ్వా అనూయేనా?"

"నేనేనే" అనుపమ ఆనందంతో గలగల నవ్వింది.

"ఎన్నేళ్ళయింది? ముప్పై ఏళ్ళు కాలేదూ?" మహతి సంభ్రమంగా అడిగింది.

"ఇంకా ఎక్కువేమో కూడా. మీ ఊరు వస్తున్నామే. రేపు మార్నింగ్ ఫ్లయిట్‌లో వస్తున్నాం.." అనుపమ చెప్పుకుపోతోంది.

"ఆగాగు. నువ్వు ఆకాశంలో చుక్కలాగా పలకరిస్తున్నావ్. ఎక్కడుంటున్నావు? ఏం చేం చేస్తున్నావు? నా నంబర్ నీకు ఎక్కడ దొరికింది?"

"మా నాన్న మీ ఊళ్ళో వర్క్ చేసినప్పుడు ఒక పెంకుటిల్లు కొన్నారు. ఈ మధ్య మా అన్నయ్య, నీకు తెలుసుగా రామనారాయణ. మనం చిన్నప్పుడు వాడిని రానా అనేవాళ్ళం. ఇప్పుడు అదే పేరుతో హీరో కూడా వచ్చాడు. మా అన్నయ్య దాన్ని అమ్మాలంటే నా సంతకం కూడా కావాలన్నారట. అందుకని వెళ్ళాను. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మీ తమ్ముడు కనిపించి నీ

నంబర్ ఇచ్చాడు. అనుకోకుండా మా వారికి హైద్రాబాద్‌లో ట్రైనింగ్ అంటే, నేనూ వస్తానని బయలుదేరా. ఆయన డైరెక్ట్‌గా స్టాఫ్ కాలేజ్‌కి వెళ్ళిపోతారు. నువ్వు ఏర్‌పోర్ట్‌కి వచ్చి నన్ను పికప్ చేసుకో. ఊళ్ళోనే ఉన్నావా?''

''ఆఁ ఉన్నాను. టిక్కెట్ ఫార్వర్డ్ చెయ్. ఏర్‌పోర్ట్‌కి వస్తాను'' మహతి ఫోన్ పెట్టేసింది.

మహతి అనుపమ ప్రాణ స్నేహితురాలు. ఇద్దరూ జంటకవుల్లా తిరిగేవారు. ఒకే ప్రాణంగా ఉండేవారు. డిగ్రీ ఫస్టియర్‌లో ఉన్నప్పుడు అనుపమ వాళ్ళ నాన్నకి ట్రాన్స్‌ఫరై కడప జిల్లాకి వెళ్ళిపోయారు. కొత్తల్లో వారానికి నాలుగు ఉత్తరాలు రాసుకున్నా, క్రమంగా అవి పల్చబడి ఆగిపోయాయి.

''అనూ ఎంత అందంగా ముద్దుగా ఉండేదో. తెలుగు మాస్టారు ఇద్దర్నీ జంటస్వరాలు అనేవారు. ఎక్కడుంటోందో, ఏం చేస్తుందో మాత్రం చెప్పలేదు. ఆత్రం, హడావిడి.'' మహతి నవ్వుకుంది.

సాయంత్రం ఇంటికి వెళ్ళాక రాజేంద్ర కోసం ఎదురు చూసింది.

''ఏంటీ మొహంలో వెయ్యిమంది సూర్యుళ్ళు వెలుగుతున్నారు?'' రాజేంద్ర రాగానే అడిగాడు.

''రాజూ! నీకు చెప్పానా అనూ అని నా ఫ్రెండ్.''

''...వాళ్ళు ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతే నెలరోజులు రాత్రుళ్ళు దిండులో మొహం దాచుకుని ఏడ్చావు.''

''ఎగ్జాక్ట్‌లీ. తను రేపు వస్తోంది'' మహతి ఆనందంగా చెప్పింది.

''వావ్! గ్రేట్ న్యూస్. కొద్ది రోజులు నువ్వు బాల్య యవ్వనాల్లోకి వెళ్ళిపోతావన్నమాట.''

''వెళ్ళడం ఏమిటి? నేను యవ్వనంలోనే ఉన్నాను. యంగ్ ఎట్ హార్ట్ తెలుసా?''

''సారీ... సారీ'' రాజేంద్ర నవ్వాడు.

డొమెస్టిక్ అరైవల్స్ నించి బయటకి వస్తున్న అనుపమని తేలిగ్గా గుర్తుపట్టేసింది మహతి. అలాగే ఉంది. వయసువల్ల వచ్చే మార్పులు స్వల్పంగా ఉన్నాయి. రాగానే మహతిని గట్టిగా కౌగలించుకుంది.

''ఎన్నాళ్ళకి కలిసామే.''

ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''అనూ. నా కోసం మా బేంక్ వాళ్ళు వచ్చారు. వెళ్ళొస్తా'' పక్కనున్న అనుపమ భర్త చెప్పాడు.

''మర్చిపోయాను. మహీ ఈయన మావారు అర్జునరావు. SBIలో పనిచేస్తున్నారు'' అనుపమ భర్తని పరిచయం చేసింది.

మహతి నమస్కారం పెట్టింది. అతను ప్రతి నమస్కారం చేసి సౌమ్యంగా నవ్వి వెళ్ళిపోయాడు. స్ట్రోలర్‌తో ఇద్దరూ పార్కింగ్ లాట్‌లోకి వచ్చారు.

''ఇక్కడే నుంచో'' చెప్పి మహతి వెళ్ళి కారు తీసుకుని వచ్చి అనుపమ ముందు ఆపింది.

స్ట్రోలర్‌ని వెనక సీట్లో పెట్టి అనుపమ ముందు సీట్లో, మహతి పక్కన కూర్చుంది.

''ఈ రోజుల్లో కూడా మారుతి 800 వాడేవాళ్ళున్నారా?'' అనుపమ సీట్ బెల్ట్ పెట్టుకుంటూ అడిగింది.

''అదేం? ఇంకా తయారు చేస్తూనే ఉన్నారుగా?'' మహతి ఆ వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా చెప్పింది.

"నువ్వేదో పత్రికలో పనిచేస్తున్నావని చెప్పాడు మీ తమ్ముడు. నన్ను భలే గుర్తుపట్టాడులే. 'నువ్వు అనూ అక్క కదా?' అని అడిగితే నేను స్టన్. అయినా సెంట్రల్ యూనివర్సిటీలో చదివావుట. అంత చిన్న ఉద్యోగం ఏమిటి?" అనుపమ విస్మయంగా అడిగింది.

"నా సంగతి సరే కాని నీ విషయాలు చెప్పు. మెరుపులా వచ్చేసావు. ఎంత హేపీగా ఉందో. రాత్రి అసలు నిద్రపట్టలేదనుకో."

"కాన్పూర్‌లో ఉంటామే. చెప్పాగా మావారు SBIలో రీజనల్ మేనేజర్. నేనేం చేయను. డిగ్రీ చదివా కాని జాబ్ చేయాల్సిన అవసరంలేదు. అవసరమున్న వాళ్ళు చేసుకుంటార్లే అని ఇల్లు చక్కదిద్దుకున్నా. ఇద్దరు పిల్లలు. పాప మెడిసిన్ ఫస్టియర్. బాబు ఇంటర్మీడియెట్."

"వెరీ నైస్. చిన్నప్పుడు ఎంత అమాయకంగా ఉండేదానివో. నేను నీ రక్షకురాలిగా ఉండేదాన్ని. అలాంటి అనూ మంచి హోం మేకర్ అయింది. ప్రౌడాఫ్‌యూ" మహతి మనస్ఫూర్తిగా మెచ్చుకుంది.

"మా అత్తగారు వాళ్ళు వాళ్ళ ఊరికి జమీందార్లులాంటివాళ్ళు. ఏదో పెళ్ళిలో నన్ను చూసి ఎంక్వయిరీ చేసి మధ్యవర్తిని మా ఇంటికి పంపారు. నాన్న మొదట సందేహించారుకాని, పెద్ద సంబంధం అని అమ్మ ఒప్పించింది. అర్జున్ మంచాయన. నేను చాలా లక్కీ" అనుపమ చెప్పింది.

కారు ఓ అపార్ట్‌మెంట్ పార్కింగ్ ప్లేస్‌లో ఆగింది. మహతి దిగి వెనక సీట్లోంచి స్ట్రోలర్ తీసుకుంది. అనుపమ కూడా దిగి చుట్టూ చూసి అడిగింది.

"ఇండిపెండెంట్ ఇల్లు కాదా మీది?"

మహతి గలగల నవ్వింది.

"మాకు ఇది చాలు. సెక్యూరిటీ, ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్ అంతా అందుబాటులో ఉంటారు."

"నిజమేలే. జర్నలిస్ట్‌లకి జీతాలు తక్కువగా పాపం" అనుపమ సానుభూతిగా చెప్పింది.

లిఫ్ట్‌లో ఆరో ఫ్లోర్‌కి వెళ్ళి అక్కడినించి మెట్లమీద పై అంతస్తుకి చేరుకున్నారు. పెంకుల కప్పున్న పెంట్ హౌస్ ఉందక్కడ. ముందు విశాలమైన ఆవరణలో పూలకుండీలు, ఇనప ఉయ్యాల, సిమెంట్ బెంచ్, ఎక్సర్‌సైజ్ బైక్, టీపాయ్, నాలుగు పేము కుర్చీలు ఉన్నాయి. తలుపు తీసి మహతి నవ్వుతూ చెప్పింది.

"మా కుటీరానికి స్వాగతం."

అనుపమ అప్రయత్నంగా 'వావ్' అన్నది.

మహతి ఓ గది తలుపు తీసి స్ట్రోలర్ గోడవార పెట్టి చెప్పింది.

"ఇదే నీ గది. బాత్‌రూం యూజ్ చేస్తావా?"

"అక్కర్లేదు. మీ ఇల్లు భలే ఉందే. చెక్కలతో కట్టారా? అనుపమ అడిగింది.

"అవును. మా అమ్మాయి ఆలోచన ఇది. ప్లాన్ కూడా తనదే" మహతి చెప్పింది.

"నీకు ఒక్కతే కూతురట కదా? ఒక్కళ్ళే చాలనుకున్నారు అన్నాడు తమ్ముడు. ఆ ఒక్కరూ అబ్బాయైతే బాగుండేది."

"అమ్మాయైతే ఏం? మనం ఆడవాళ్ళమేగా? మీ అమ్మాయి మెడిసిన్ చదువుతోంది ఎంచక్కా" మహతి చురుగ్గా చూస్తూ అడిగింది.

"ఐనా సరే. ఒక అబ్బాయి ఉండాలి."

మహతికి ఎందుకో అసంతృప్తిగా అనిపించింది.

"కాఫీ తాగుదాం రా" వంటింట్లోకి దారి తీసింది.

"మీ వారు ఎప్పుడొస్తారు?"

"ఆరవుతుంది. తన ఆఫీస్ ఇక్కడికి దూరం బాగా."

"ఓ అర్జున్ కూడా అంతే. పెద్ద పోస్ట్ కదా! రాత్రి చాలా లేట్‌గా వస్తారు. క్లర్క్స్ అయితే హాయిగా ఐదవగానే ఇంటికి వెళ్ళిపోతారు" అనుపమ చెప్పింది.

"అనూ! ప్రస్తుత విషయాలు మానేసి మీరు కడప వెళ్ళినప్పటి విశేషాలు చెప్పు. అమ్మా నాన్న ఎలా ఉన్నారు? రానా అన్నయ్య ఏ ఊళ్ళో ఉంటున్నాడు?" మహతి కాఫీ కప్పు అందిస్తూ అడిగింది.

"నాన్నపోయి ఐదారేళ్ళు అవుతోంది. అమ్మ అన్నయ్య దగ్గరే ఉంది విశాఖపట్టణంలో. వాడు అంత బాగా సెటిల్ కాలేదు. టీచర్‌గా పనిచేస్తున్నాడు."

"ప్రైవేట్ స్కూల్‌లోనా?"

"కాదు జడ్ పి.లోనే."

"మరి సెటిలైనట్లేగా?" విస్మయంగా అడిగింది.

అనుపమ మాట్లాడలేదు.

"అప్పుడప్పుడు వైజాగ్ వెళ్ళి అమ్మని చూసివస్తూంటావా?" మహతి అడిగింది.

"తక్కువ. అమ్మనే రమ్మంటాను. కాని రాదు. మొన్న మీ ఊళ్ళో ఇల్లు అమ్మినప్పుడు రానా లక్షరూపాయలే ఇచ్చాడు. సగం ఇవ్వమంటే ఇవ్వనన్నాడు. అమ్మకూడా వాడినే సపోర్ట్ చేసింది. అప్పటినించి మాటలు లేవు."

మహతికి చేదు తిన్నట్లుగా అనిపించింది.

"మరి ఆ లక్ష కూడా వెనక్కిచ్చేశావా?" బలవంతంగా నవ్వుతూ అడిగింది.

"ఎందుకివ్వాలి? అదైనా వచ్చిందనుకుని మా అమ్మాయికి బైక్ కొన్నా."

మహతికి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"మరీ రెండు బెడ్రూములేమిటి? కనీసం మూడన్నా ఉండద్దా? ఇంత ఖాళీ స్థలం ఉందిగా" అనుపమ అడిగింది.

"మా బడ్జెట్ అంతే."

అనుపమ అసంతృప్తిగా చూసింది.

"షో కేసులు లేవు. అన్నీ పుస్తకాల రేక్సే. కనీసం ఫ్లవర్ వేజ్ కూడా లేదేంటి? బయట అన్ని పూలచెట్లున్నాయ్. రెండుపూలు కోసి పెడితే బావుండేదిగా?" అడిగింది.

"షో కేస్, బొమ్మలు మా ముగ్గురికీ ఆ అభిరుచి లేదు. పూలు కూడా కోయం అవే రాలిపోవాలి. అంతే."

"అదేంటి దేవుడికి పెట్టవూ?" అనుపమ వింతగా చూస్తూ అడిగింది.

"దేవుడా?" మహతి నవ్వి చెప్పింది.

"మేం ముగ్గురం నాస్తికులమే."

"సరిపోయారు. ఐనా చిన్నప్పుడు మనం వినాయక పందిళ్ళు తిరుగుతూ ప్రసాదాలు తినేవాళ్ళం కదూ? కార్తీక పౌర్ణమికి ఉపవాసముండి, సాయంత్రం శివాలయానికి వెళ్ళొచ్చి పళ్ళు తినేవాళ్ళం కదా? కొత్తగా ఈ నాస్తికత్వం ఎప్పటినించి?"

"మనం ఇరవై ఏళ్ళప్పుడు ఉన్నట్లుగా నలభైఏళ్ళప్పుడు ఉండం కదా? పధ్నాలుగు, పదిహేనేళ్ళప్పుడు అలాగే ఉన్నాను. తర్వాత నమ్మకం పోయింది."

"ఎదిగిపోయావు" అనుపమ వెటకారంగా నవ్వింది.

"అంతే అనుకో" మహతి కూడా నవ్వింది.

"కొద్దిసేపు పడుకుంటానే. పొద్దున్నే లేవాల్సి వచ్చింది." అనుపమ ఆవులిస్తూ చెప్పి తనకి కేటాయించిన గదిలోకి వెళ్ళింది.

మహతి దీర్ఘంగా నిట్టూర్చి లాప్‌టాప్ ఆన్ చేసింది.

అనుపమ నిద్రలేచేప్పటికి చీకటి పడింది. హాల్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. లేచి జుట్టు సరిచేసుకుని బయటకి వచ్చింది.

తెల్లటి లాల్చీ, పైజమాల్లో ఉన్న వ్యక్తి మహతి పక్క పక్కన కూర్చుని టివిలో వార్తలు చూస్తున్నారు.

"అనూ! లేచావా? రాజూ తనే అనుపమ. మేం చదువుకునే రోజుల్లో బ్యూటీ క్వీన్. ముద్దమందారం" మహతి సిగ్గుగా పరిచయం చేసింది.

అనుపమ సిగ్గుగా నవ్వింది.

"అనూ. రాజేంద్ర టి.వి ఛానల్లో న్యూస్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు."

రాజేంద్ర పలకరింపుగా నవ్వి చెప్పాడు. "మీ గురించి మొత్తం తెలుసండీ. మా పెళ్ళైనప్పటినించి మహీ మీ గురించి చెప్తూనే ఉంది. మీరు రావడం చాలా ఆనందంగా ఉంది."

"అనూ ఆకలిగా లేదూ? వచ్చినప్పటినించి ఏమీ తినలేదు. రా. కిచెన్‌లోకి వెళ్దాం." మహతి స్నేహితురాలిని కిచెన్‌లోకి తీసుకెళ్ళింది.

"ముందు కాఫీ ఇవ్వు. అహ వద్దులే. మంచినీళ్ళివ్వు" అను బద్ధకంగా చెప్పింది.

"నీ కోసమని పకోడీలు చేసాను. చాలా రోజుల తర్వాత. స్వీట్స్ రాజు బయట నించి తెచ్చాడు. బయట కూర్చుందాం రా"

బయటికి వచ్చిన అనుపమ మరోసారి అప్రయత్నంగా 'వావ్' అంది. ఏడో అంతస్థులో ఉండటంతో బయటి వీధి దీపాలు, వాహనాల వెలుగులూ అందంగా కనిపిస్తున్నాయి. శబ్దం వినిపించడంలేదు. చల్లటిగాలి వీస్తోంది. చందమామ దగ్గరగా కనిపిస్తున్నాడు.

"ఈ మధ్య నూనె వస్తువులేం తినడంలేదు" ఓ పకోడి అందుకుంటూ చెప్పింది అనుపమ.

"అవును. మేమూ అంతే. ఐనా నువ్వు మారలేదు అనూ. అలాగే ఉన్నావు. అప్రిషియేట్ యూ. ఇల్లు, సంసారం అని చాలామంది లేడీస్ ఒంటిని గురించి పట్టించుకోరు" మహతి ప్రశంసించింది.

అనుపమ నవ్వింది.

"నువ్వూ అలాగే ఉన్నావు. మీ తమ్ముడు నీ ఫోన్ నంబర్ ఇవ్వగానే నీకు కాల్ చేద్దాం అనుకున్నా. కాని ఆ కాగితం నా బేగ్‌లో ఎక్కడో మిస్సయింది. మా వారు హైదరాబాద్ వెళ్తున్నాను అనగానే నేనూ వస్తానని చెప్పి, మళ్ళీ బేగ్స్ అన్నీ శోధించి పట్టుకున్నా. నా ఎక్సైట్‌మెంట్‌ని చూసి మా పిల్లలు తెగ నవ్వారు."

మహతి అనుపమ చేతిని పట్టుకుని చెప్పింది.

"నాకు తెలుసు. నువ్వు నాకోసం అంతదూరం నించి వచ్చావు. మన స్నేహాన్ని నాలాగే నువ్వు కూడా మర్చిపోలేదు."

"ఎలా మర్చిపోతానే" అనుపమ గద్గదంగా చెప్పింది.

ఇద్దరూ కొద్దిసేపు మౌనంగా ఉండిపోయారు.

"ఈ పత్రికల్లో ఉద్యోగాలేమిటి మహీ. ఏదైనా మంచి జాబ్ చూసుకో. మా వారు ఆర్.ఎం. కదా. ట్రాన్స్‌ఫర్ మీద ఏ ఊరు వెళ్తే ఆ ఊళ్ళో ఇల్లు కొన్నాం తెలుసా?" అనుపమ చెప్పింది.

"వంట చేసుకుందామా? మాకు ఎనిమిదిన్నరకల్లా తినే అలవాటు. అంటే రాజు త్వరగా ఇంటికి వచ్చిన రోజుల్లోనన్నమాట" మహతి లేస్తూ చెప్పింది.

ఆ రాత్రి మహతి అనుపమ గదిలో పడుకుంది. ఇద్దరూ ఆనాటి ముచ్చట్లలో మునిగిపోయారు.

"నీకు నంబర్ థర్టీ గుర్తున్నాడా? ఇప్పుడేం చేస్తున్నాడో తెలుసా?" అనుపమ అడిగింది.

"థర్టీ నా?... అరుణ్ కదూ?" మహతి అడిగింది.

"ఆс అవునవును. అరుణ్. నా వెంటపడేవాడు. వాళ్ళింట్లో పూసే పత్తి మందార పువ్వు తెచ్చిచ్చేవాడు రోజూ" అనుపమ చెప్పింది.

"అవును. నువ్వు సిగ్గుపడుతూ తీసుకునేదానివి. అంత పెద్ద పువ్వుని తల్లో పెట్టుకునే దానివి" మహతి నవ్వింది.

"చిన్నప్పుడు అలాంటి చిన్న చిన్న ఆరాధనలు బాగుంటాయేం?" అనుపమ సిగ్గుగా చెప్పింది.

"కాబోలు టామ్ బోయ్‌లా ఉంటానని నన్నెవరూ ఆరాధించలేదు" మహతి విచారం నటిస్తూ చెప్పింది.

"అరుణ్ ఇప్పుడేం చేస్తున్నాడో తెలుసా?"

"లేదు. అసలు నువ్వు గుర్తు చేసేదాకా గుర్తుకూడాలేడు. మా తమ్ముడ్ని అడుగుతాలే. నువ్వు చిన్నప్పుడు చాలా అందంగా ఉండేదానివి. ఇప్పుడూ అందగత్తెవే అనుకో. అంతా నిన్ను ఇష్టపడేవాళ్ళు. మీ రానా నీ వెనకే భీముడల్లే వచ్చేవాడు స్కూల్‌కి. నిన్ను ఎవరన్నా ఏమన్నా అంటే రానా చేతిలో చచ్చారే"

"అవును. పాపం మా అన్నయ్య భలే ప్రొటెక్షన్ ఇచ్చేవాడు. నా మూలంగా బయట గొడవలు పడి, ఇంట్లో నాన్న చేత తన్నులు తినేవాడు. నన్నో రాజకుమారిలాగా ట్రీట్ చేసేవాడు. నాకెవరైనా ప్రేమలేఖ రాసారంటే వాడి చేతిలో వాళ్ళకి ఉండేవీ.." అనుపమ పకపక నవ్వింది.

"అనూ. అంత ప్రేమగా ఉన్న అన్నా చెల్లెళ్ళు ఇప్పుడెందుకు మాట్లాడుకోరు? మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనా? ఒకే ఇంట్లో పుట్టి పెరిగిన మీకు డబ్బు విషయంలో పంతాలేమిటి? ఆ ప్రేమ గుర్తు రాలేదా? అన్నయ్య దగ్గర ఉందని అమ్మని కూడా చూడవా? పెద్దవాళ్ళు ఎంతకాలం ఉంటారు అనూ? వాళ్ళు ఉన్నప్పుడే చూసుకోవాలి" మహతి విచారంగా చెప్పింది. అనుపమ మాట్లాడలేదు. మహతి సమాధానం కోసం కొద్దిసేపు ఎదురుచూసి నిద్రపోయింది.

మర్నాడు ఉదయం కాఫీ తాగాక అనుపమ అడిగింది.

"మహీ నన్ను జూబ్లీ హిల్స్‌లో డ్రాప్ చేస్తావా? మా ఆడపడుచు వాళ్ళింట్లో?"

"అదేంటీ? నా కోసం వచ్చానన్నావు? మీ వారి పనయ్యేదాకా ఉంటావని ఆశపడ్డాను" మహతి చిరుకోపంగా చెప్పింది.

"హైదరాబాద్ వస్తూనే ఉంటానులే. మా ఆడపడుచు వాళ్ళింటికనే నా ప్లాన్. నీ ఫోన్ నంబర్ దొరకగానే ముందు నీతో ఇక్కడికి వచ్చి మర్నాడు వాళ్ళింటికి వెళ్ళచ్చు అనుకున్నా" అనుపమ నవ్వేసింది.

తొమ్మిదిగంటలకల్లా బయలుదేరారు.

"మా ఆడపడుచు వాళ్ళాయన ఫిల్మ్ ఫైనాన్షియర్. రియల్ ఎస్టేట్ కూడా ఉంది. వాళ్ళకి చాలా బిజినెస్‌లు ఉన్నాయి. నాతో వాళ్ళింట్లోకి రా. నీ కళ్ళు తిరిగిపోతాయి. ఇంటీరియర్స్ ఎంత బాగుంటాయో. వదిన ఏం అనుకోదు" అనుపమ చెప్పింది.

"ఇంకోసారి వస్తాలే. నాకు ఆఫీస్ టైమౌతుంది" చెప్పి మహతి ఓ సౌధం ముందు అనుపమని దింపి వెళ్ళిపోయింది.

"అనుపమ అసలు మళ్ళీ నా జీవితంలోకి రాకుండా ఉంటే బాగుండేది. చిన్నప్పుడు ఇద్దరం ఉంటే వాళ్ళింట్లో లేదా మా ఇంట్లో ఉండేవాళ్ళం. ఇప్పుడు తనని ఒక్కరోజు భరించలేకపోయాను. అమాయకంగా ఉండే అనూ ఇంత గ్రీడీ అవుతుందనుకోలేదు. చిన్నప్పుడు ఆ లక్షణాలు తనలో లేవు కూడా" మహతి బాధగా చెప్పింది.

"మధ్య తరగతి అమ్మాయి ఐశ్వర్యవంతుల ఇంటికి వెళ్ళింది కదా? సంపద వల్ల వచ్చే సుఖం అర్ధమైవుంటుంది. సైకాలజీ చదివావు. నీ ఫ్రెండ్ మనస్థత్వం అర్ధం కాలేదా?" రాజేంద్ర నవ్వి అడిగాడు.

"అంత సంపద ఉండికూడా వాటా కోసం సొంత అన్నయ్యతో గొడవ పెట్టుకోవడం, ఆ వంకతో అమ్మని చూడకపోవడం దారుణం. తన హృదయంలో సున్నితత్వముంది. నాలాగే తనకీ కన్నీళ్ళు వచ్చాయి. అరుణ్ గురించి మాట్లాడుతూ ఆ రోజుల్లోకి వెళ్ళిపోయింది. వాళ్ళన్నయ్య గురించి మంచిగా మాట్లాడింది. కాని చంద్రుడ్ని మబ్బు కప్పేసినట్లు దీన్ని డబ్బు మీది యావ కప్పేసింది. మనమ్మాయి ఇంట్లో కనపడకపోతే 'ఏదీ?' అని కూడా అడగలేదు. తనకంటే తక్కువ వాళ్ళు అనుకోగానే మనకి విలువ ఇవ్వక్కర్లేదు అనుకుంది. నాకు తెలిసి అను ఇంకా చాలాసార్లు హైదరాబాద్ రావచ్చు కానీ, నాకు ఫోన్ చేయదు. కలవదు" మహతి కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments